క్లుప్తంగా...

ఈఎంఆర్ఐలో ఉద్యోగావకాశాలు

మేడ్చల్: గుండ్లపోచంపల్లిలోని ఈఎంఆర్ఐలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ఆసక్తి గల అర్హత ఉన్న యువత దరఖాస్తు చేసుకోవాలని సంస్థ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ జాన్ షాహిద్ కోరారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత చెంది కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న వారు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కీసర: మండల పరిషత్ కార్యాలయంలో నేడు (శనివారం) ఉదయం 11 గంటలకు కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ రమాదేవి తెలిపారు. ఉ.11 గంటలకు నిర్వహించే సర్వసభ్య సమావేశానికి వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తదితరులు సకాలంలో హాజరుకావాలని ఆమె కోరారు.

ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డుల దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛత కార్యక్రమాల అమలు, పారిశుద్ధ్య, ఘన వ్యర్థాల నిర్వహణ అంశాల్లో ప్రతిభ చూపిన మహిళకు ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డుల ప్రదానం కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాములు కోరారు. ఈ నెల 22వ తేదీలోపు మహిళలు దరకాస్తు చేసుకోవాలని, ఎంపికైన మహిళలకు జూన్ 22వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

జాతీయ అప్రెంటీస్ షిప్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

శామీర్‌పేట్: జాతీయ అప్రెంటీస్ షిప్ మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శామీర్‌పేట ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వి.లలిత అన్నారు. శామీర్‌పేట ఐటీఐ కళాశాలలో మార్చి 20న ఉదయం 9.30 గంటలకు ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్ షిప్ మేళాను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పారిశ్రామిక శిక్షణ సంస్థ ఐటీఐలో ఉత్తీర్ణులైన విద్యార్థులు, అప్రెంటీస్ షిప్‌కు హాజరయ్యే అభ్యర్థులు ముందుగా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

పారిశ్రామిక రంగానికి పెద్దపీట

శామీర్‌పేట్: పారిశ్రామిక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండలం పోతారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్వాంటోమ్ ఇండస్ట్రీస్ పరిశ్రమను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ హారిక, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మాజీ చైర్మన్ పెంటారెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు హరిమోహన్‌రెడ్డి, జాం రవి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించని హోటళ్లపై చర్యలు

పోచారం: ఆస్తి పన్ను చెల్లించని హోటళ్లలోని వస్తువులను మున్సిపల్ కమిషనర్ సురేష్ సీజ్ చేశారు. అనంతరం హోటల్ నిర్వాహకులు పన్ను చెల్లించడంతో వస్తువులను తిరిగి అప్పగించారు. తోట శ్వేతసుధా శ్రీనివాసరావు రూ.3.34 లక్షలు, చిలుక సనీత రూ.2.02 లక్షలు, శ్రీకాంత్‌రెడ్డి రూ.83,358 ఆస్తి పన్ను చెల్లించినట్లు కమిషనర్ తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



పోచారం: మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న భారీ షెడ్లను కమిషనర్ సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం కూల్చివేతలు చేపట్టారు. అన్నోజిగూడలోని సర్వే నంబర్.46లో రాజీవ్ గృహకల్ప కాలనీ ప్రధాన రహదారిపై వెలసిన అక్రమ షెడ్లను మున్సిపల్ సిబ్బంది తొలగించారు.



మేడ్చల్‌లో కరెంట్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలను నరికివేసిన విద్యుత్ సిబ్బంది





వారు నాటడం.. వీరు నరకడం!

- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపంతో భారీగా ప్రజాధనం వృథా
- హరితహారంలో నాటిన మొక్కలను నరుకుతున్న విద్యుత్ శాఖ

మేడ్చల్: హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఏడాది రూ.లక్షల కొద్ది ప్రభుత్వ ధనం వెచ్చించి మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో అధికారులు, పాలకులు వేల సంఖ్యలో మొక్కలు నాటుతూ.. నాటిస్తూ.. ఉండగా అవి రెండు, మూడేళ్లలో ఏపుగా పెరిగి పెద్దవిగా మారుతున్న దశలో విద్యుత్ శాఖ అధికారులు నరికేస్తున్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రధాన, అంతర్గత రోడ్లకు ఇరువైపులా ఖాళీ స్థలాలు అధికంగా ఉండటంతో వాటి గుండా విద్యుత్ అధికారులు ఎన్నో ఏళ్ల క్రితం విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి కరెంట్ సరఫరా చేస్తున్నారు. హరితహారంలో భాగంగా మండల, మున్సిపల్ అధికారులు ప్రతీ వర్షాకాలంలో వేల సంఖ్యలో మొక్కలు నాటుతున్నారు. పైన విద్యుత్ తీగలు ఉన్నాయని తెలిసి కూడా చెట్లు నాటే వారు నాటుతూనే ఉన్నారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ తీగలకు ఇబ్బందికరంగా ఉన్నాయని చెట్లను నాటిన కొన్ని రోజుల్లోనే నరికేస్తుండటం పరిపాటిగా మారింది.

ట్రిమ్మింగ్ పేరుతో చెట్లు, వాటి కొమ్మల తొలగింపు...

ప్రతీ సీజన్‌లో పాలకవర్గం మొక్కలు నాటి వాటికి లక్షలు వెచ్చించి ట్యాంకర్ల ద్వారా నీరు పోసి రక్షిస్తున్నారు. మొక్కలు ఏపుగా పెరిగి కరెంట్ తీగలను తాకే స్థాయికి చేరుకోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయని విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి చెట్ల కొమ్మలను నరికివేస్తున్నారు. ట్రిమ్మింగ్ పేరుతో విద్యుత్ అధికారులు మేడ్చల్ నియోజకవర్గంలో నెల రోజులుగా నిత్యం చెట్ల కొమ్మలను నరికివేస్తూనే ఉన్నారు. పైన ఏపుగా ఉన్న కొమ్మలను నరికివేయడంతో చాలా వరకు పెరిగిన మొక్కలు పూర్తిగా ఎండిపోతున్నాయి. ప్రతీ ఏటా వారు నాటడం వీరు నరకడంతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతుంది.

శాఖల మధ్య సమన్వయ లోపంతోనే..

అన్ని శాఖల అధికారులు పని చేసేది మండలంలో, మున్సిపాలిటీలలోనైనా వారి మధ్య సమన్వయం పూర్తిగా కొరవడింది. ప్రతీ సీజన్‌లో మొక్కలు నాటే హరితహారంలో అన్ని శాఖల అధికారులు విద్యుత్ తీగల కింద మొక్కలు నాటొద్దని, నాటిన మొక్కలు నాశనం చేయొద్దని ఏ శాఖ అధికారి బహిరంగంగా చెప్పడం లేదు. వారు చేసే పని వారు.. వీరు చేసే పని వీరు.. చేస్తున్నారే తప్పా ముందుగానే సమన్వయంతో మాత్రం పని చేయడం లేదు. కార్యక్రమాలు చేపట్టే సమయంలో అధికారులతో నిర్వహించే సమీక్ష సమావేశాల్లో ఎక్కడ మొక్కలు నాటాలి? ఎక్కడ నాటోద్దు? కనీస పరిస్థితులపై చర్చలు చేయడం లేదు. అధికారుల అనాలోచిత చర్యల వల్లే ప్రతి ఏటా లక్షల రూపాయల ధనం వృథా అవుతుంది.

ప్రజాధనం వృథా అవుతోంది



విద్యుత్, ఇతర శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ప్రతీ సంవత్సరం లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతుంది. లక్షలు వెచ్చించి అధికారులు మొక్కలు నాటుతుండగా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయని ఆ శాఖ అధికారులు చెట్లను తొలగిస్తున్నారు. మొక్కలు నాటే ముందు రెండు శాఖల అధికారులు మొక్కలు నాటే అంశంపై చర్చించుకుంటే ఎలాంటి నష్టం ఉండదు. మొక్కుబడిగా కాకుండా అధికారులు వాస్తవాలను చూసి పనులు చేపట్టాలి.

– ప్రేందాస్, మేడ్చల్ బీజేపీ నాయకుడు

కేవలం కొమ్మలను మాత్రమే నరికివేస్తున్నాం.

మొక్కలు బాగా పెరిగి వాటి కొమ్మలు విద్యుత్ తీగలకు తాకుతున్న సమయంలో గాలివాన వచ్చిన సందర్భంలో కొమ్మలను తొలగిస్తున్నాం. మొక్కలకు ఎలాంటి హానీ కలగకుండా కేవలం పైన తీగలకు తాకుతున్న కొమ్మలను కట్ చేస్తున్నాం. ముందుగానే తీగల కింద మొక్కలు నాటొద్దని చెప్పే అధికారం మాకు లేదు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడం తమవంతు బాధ్యత కాబట్టి కొమ్మల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా కొమ్మలను నరికివేస్తున్నాం.

– పవన్‌చందు, ఏఈ, విద్యుత్ శాఖ, మేడ్చల్ రూరల్

ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు కలిగి ఉండాలి

ఆధార్ మానిటరింగ్ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు కలిగి ఉండాలని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధార్ కార్డులు లేని వారు తప్పకుండా ఆధార్ కార్డులు కలిగి ఉండేలా మానిటరింగ్ కమిటీ చూడాలని సూచించారు. ఆధార్ కలిగిన ప్రతి ఒక్కరూ పదేళ్లకోసారి గుర్తింపు కార్డు, చిరునామా ధ్రువీకరణ పత్రాలు సమర్పించి కేంద్ర గుర్తింపు సమాచార నిధి (సీఐడీఆర్)లో అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతుందన్నారు. ఆధార్ పోర్టల్‌లో అప్‌డేట్ కానీ పక్షంలో దగ్గరలో ఉన్న ఆధార్ కేంద్రం నుంచి ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని సూచించారు. ఆధార్ కార్డు ఇప్పటి వరకు తీసుకోని వారు తప్పకుండా తీసుకోవాలని, జిల్లాలో చిన్నారులు మొదలుకుని వృద్ధుల వరకు అందరికీ ఆధార్ ఉండేలా మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, లీడ్ బ్యాంక్ మేనేజర్ (ఎల్డీఎమ్) కిశోర్ కుమార్, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) అధికారి పావనీ, అసిస్టెంట్ మేనేజర్ సత్యకళ (యూఐడీఏఐ), ఈడీఎమ్ భానుప్రకాశ్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ పావనీ

ఘట్‌కేసర్. మున్సిపాలిటీ పరిధిలోని బుగ్గబావి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను చైర్‌పర్సన్ పావనీ జంగయ్యయాదవ్ శుక్రవారం పరిశీలించారు. కాలనీలో పూర్తి స్థాయి డ్రైనేజీ ఏర్పాటుకు సహకార బ్యాంకు చైర్మన్, డైరెక్టర్లతో చర్చించి ప్రహరీ లోపలి నుంచి డ్రైనేజీ నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జహంగీర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, మల్లేష్, ఆంజనేయులుగౌడ్, బ్యాంకు డైరెక్టర్లు ధర్మారెడ్డి, లక్ష్మారెడ్డి, శానిటరీ ఇన్ చార్జి యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పన్నుల వసూలు

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను బకాయిలు ఉన్న వారు వెంటనే తమ బకాయిలను చెల్లించాలని కమిషనర్ రాములు కోరారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో ఆయన పాల్గొని పన్నులు వసూలు చేశారు. బకాయి ఉన్న కౌన్సిలర్ల ఇంటికి వెళ్లి ఆయన పన్నులను పొందారు. వంద శాతం పన్నుల వసూలుకు మున్సిపల్ ప్రజలు సహకరించాలని కోరారు.



కౌన్సిలర్ బాలరాజు నుంచి పన్నులు వసూలు చేస్తున్న కమిషనర్

వీధి కుక్కల కట్టడికి చర్యలు



వీధి కుక్కలకు రాబిస్ టీకా వేసే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలో వీధి కుక్కల బెడదను తగ్గించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలో వివిధ కాలనీల్లో తిరుగుతున్న కుక్కలను పట్టుకొని వాటికి జంతు జనన నియంత్రణతో పాటు యాంటీరాబిస్ టీకాలు ఇచ్చే బ్లూక్రాస్ సంస్థతో మున్సిపల్ ఆధ్వర్యంలో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు సంస్థ సుమారు 164 వీధి కుక్కలను పట్టుకుని వాటిలో 63 శునకాలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించి రాబిస్ టీకాలు వేయించడం జరిగిందన్నారు. ఇటీవల మున్సిపల్ పరిధిలోని వీధి కుక్కలతో ప్రజలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో ఈ మేరకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని, ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, బ్లూక్రాస్ టీం కాలనీ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్రిక్తంగా ఏబీవీపీ కలెక్టరేట్ ముట్టడి

ప్రశ్నాపత్రాల లీకేజీతో కలెక్టరేట్ వద్ద ఆందోళన





సాక్షి, మేడ్చల్ జిల్లా: టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్ రెడ్డి, కార్యదర్శి అనిత రామచంద్రన్ నైతిక బాధ్యత వహిస్తూ తమ పదవులకు రాజీనామా చేయాలని శుక్రవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. కలెక్టరేట్లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థి నాయకుల ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన పెనుగులాటలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీకి నిరసనగా ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల కలెక్టరేట్ ముట్టడి పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమనిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ మాట్లాడుతూ.. వందలాది మంది నిరుద్యోగుల ఆత్మ బలిదానాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం నేడు నిరుద్యోగుల పాలిట శాపంగా సీఎం కేసీఆర్ మార్చారన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా అరకొర నోటిఫికేషన్లు వచ్చినా ఆ నోటిఫికేషన్లను సక్రమంగా నిర్వహించడంలో టీఎస్‌పీఎస్సీ విఫలమైందన్నారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ హైకోర్టు జడ్జి చేత విచారణ జరిపించాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తోందని, లేని పక్షంలో ఏబీవీపీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్, విభాగ్ కన్వీనర్ శ్యామ్, జిల్లా నాయకులు మనీషా కార్తీక్, రాజు, శిరీష పాల్గొన్నారు.

రుణాల మంజూరులో బ్యాంకర్ల పాత్ర కీలకం

- బ్యాంకర్ల సమావేశంలో అదనపు కలెక్టర్ అభిషేక్

సాక్షి,మేడ్చల్ జిల్లా: అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందచేసి వారి ఆర్థికాభ్యున్నతికి తోడ్పాటునందించడంలో బ్యాంకర్ల పాత్ర ఎంతో కీలకమని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీ) అభిషేక్ అగస్త్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్ల త్రైమాసిక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్హులైన వారికి అనేక సంక్షేమ పథకాల కింద రుణాలను మంజూరు చేస్తున్నాయని, వాటిని లబ్ధిదారులకు చేరేలా బ్యాంకర్లు కృషి చేయాన్నారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక మొదలుకొని వారికి రుణాలు అందించే వరకు బ్యాంకర్లు ఎంతో ముఖ్యభూమిక పోషిస్తారన్నారు. జిల్లా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం 190 శాతం సాధించినట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని, విద్యార్థులకు ఉన్నత చదువులకు విద్యా రుణాలను అత్యధిక సంఖ్యలో మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నిజమైన లబ్ధిదారులను ఆదుకోవాలన్నారు. దరఖాస్తులను తిరస్కరించేటప్పుడు కావలసిన సలహాలు, కారణాలను దరఖాస్తుదారుడికి తెలుపాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ కిశోర్ కుమార్, కెనరా బ్యాంకు ఏజీఎమ్ ఇందిర, ఎస్బీఐ ఏజీఎమ్ సతీష్, యూబీఐ ఏజీఎమ్ ప్రకాష్‌రావు, టీజీబీ యూసుఫ్, నాబార్డు అధికారి శివశర్మ, ఆర్బీఐ అధికారి రాజేంద్రప్రసాద్, డీఆర్డీఓ పద్మజారాణి, జడ్పీ సీఈఓ దేవసహాయం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలాజీ, వివిధ బ్యాంకుల అధికారులు, కంట్రోలర్లు పాల్గొన్నారు.

నర్సింహా రెడ్డి కళాశాలలో జాతీయ స్థాయి వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న రెండ్రోజుల వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమైంది. అడ్వాన్స్ ఇన్ సర్వేయింగ్ మెథడ్స్ అండ్ టెక్నిక్స్‌పై నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను భారతీయ భూగర్భ సర్వేక్షన్ డైరెక్టర్ కుటుంబరావు, ఎన్ఐసీఎమ్మార్ ప్రొఫెసర్ ఇంద్రసేన్‌సింగ్, డైరెక్టర్ మురళీధర్, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ శశిలు ప్రారంభించి విద్యార్థులకు వర్క్‌షాప్‌ను గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, సెక్రెటరీ త్రిశూల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ శ్రమ్ కార్డుల పంపిణీ



కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: వైఎస్సార్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎదులాబాద్‌లో ఈ శ్రమ్ కార్డులను పంపిణీ చేశారు. అయుష్మాన్ భారత్ పథకాలను, కేంద్ర ప్రభుత్వ పథకాలను కరపత్రాల్లో ముద్రించి వాటిని పంపిణీ చేశారు. ఈ శ్రమ్ కార్డులను ట్రస్టు ఆధ్వర్యంలో ముద్రించి పేదలకు అందస్తున్నట్లు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, రామోజీ, ప్రవీణ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

ఘట్‌కేసర్: టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి విజయం సాధించడంతో పట్టణ బీజేపీ నాయకులు మిఠాయిలు పంచుకుని, బాణాసంచాలు పేల్చి నేతలు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, హనుమాన్, రామోజీ తదితరులు పాల్గొన్నారు.



సంబరాల్లో బీజేపీ నాయకులు

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ 7వ వార్డుకు చెందిన నవీన్‌కు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును కౌన్సిలర్ రాజకుమారి సుధాకర్ శుక్రవారం అందజేశారు. సీఎం సహాయనిధి ద్వారా నవీన్‌కు రూ.27,500 మంజూరయ్యాయని, ఆ చెక్కును అతడి ఇంటికి వెళ్లి అందజేసినట్లు కౌన్సిలర్ తెలిపారు.



చెక్కును అందజేస్తున్న కౌన్సిలర్

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం



సీపీఎం నాయకులు వేయించిన గుడారాలు

సాక్షి, సిటీబ్యూరో: పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అవుషాపూర్‌లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు సీపీఎం నాయకులు శుక్రవారం యత్నించారు. సర్వే నంబర్.96లోని 5 ఎకరాల ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసేందుకు చదును చేసి గూడారాలు వేయించారు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, ఘటనా స్థలానికి వచ్చి కబ్జాయత్నాన్ని అడ్డుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఆర్ఐ అలేఖ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిలో వేయించిన హద్దులను, గూడారాలను తొలగించి తిరిగి యథాస్థితిలోకి తెచ్చారు. పోలీసులు నాయకులను అదుపులోకి తీసుకునే క్రమంలో వాగ్వాదం జరిగింది. నాయకులను వ్యాన్‌లో ఎక్కించి కీసర, మేడిపల్లి పోలీస్ స్టేషన్లకు తరలించారు.

అడ్డుకున్న పోలీసులు

మల్కాజ్‌గిరి డీసీపీ జానకీ, ఏసీపీ నరేశ్‌రెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించారు. సీఐ అశోక్‌రెడ్డి పోలీసుల పికెటింగ్ ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు పలువురు వీఆర్ఏలను ఘటనా స్థలంలో ఉండాలని ఆదేశించారు.

కేసు నమోదు...

అవుషాపూర్‌లోని సర్వేనంబర్96లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా ప్రవేశించి గుడారాలు వేసిన ప్రభుత్వ ఉద్యోగులకు ఆటంకం కలిగించినందుకు నార్కెట్‌పల్లి సబిత, గుర్రం నాగమణి, కప్పుల శోభ, కె.అలివేలు, చింతల యాదయ్యలపై కేసు నమోదు చేశారు.



సీపీఎం నేతలను అదుపులోకి తీసుకుంటు..

చెరువుల పరిరక్షణేదీ!

- నగర శివారు పట్టణాలు, పంచాయతీల్లో పలు చోట్ల అన్యాక్రాంతం
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, చెరువు శిఖాల్లో యథేచ్ఛగా నిర్మాణాలు
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం
- మొద్దు నిద్రలో నీటి పారుదల శాఖ

నగర శివారులో పట్టణాలు, కాలనీలు, బస్తీలు శర వేగంగా విస్తరిస్తుండటంతో అక్రమార్కుల కళ్లు చెరువులపై పడ్డాయి. వీటిని ఆక్రమించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారు. రాజకీయ పలుకుడి ఉన్న వారైతే ఏకంగా ప్రైవేట్ విద్యా సంస్థలు, ఆస్పత్రులను నిర్మిస్తున్నారు. చెరువు శిఖం, బఫర్ జోన్ అనే తేడా లేకుండా యథేచ్ఛగా కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. శివారుల్లో ప్రధాన పట్టణాల్లో ఇప్పటికే సగానికిపైగా చెరువులు, కుంటలు అన్యాక్రాంతమయ్యాయి. వీటిని పరిరక్షించాల్సిన నీటిపారుదల, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో పట్టణాల్లో చెరువులు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది.

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారు ప్రాంతాలు, గ్రామ పంచాయతీల్లో యథేచ్ఛగా చెరువులను కబ్జా చేస్తున్నారు. వీటి కాపాడేందుకు ప్రతి జిల్లాలో చెరువుల పరిరక్షణ కమిటీ వేసి పరిరక్షించాలని గతంలో హైకోర్టు పేర్కొంది. అందు కోసం కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించింది. ఆ కమిటీలో పోలీసు అధికారులకు స్థానం కల్పించాలని ఆదేశించింది. కానీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో చెరువుల పరిరక్షణ కమిటీలు ఉన్నా నామ మాత్రంగానే పని చేస్తున్నాయి. పట్టణంలో ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలను ఇప్పటికీ ఈ కమిటీలు పూర్తి స్థాయిలో గుర్తించలేదు. కొన్నిచోట్ల గుర్తించినా ప్రజా ప్రతినిధులు ఒత్తిళ్లతో వాటిని తొలగించడం లేదు.

476 చెరువుల సరిహద్దుల గుర్తింపు...

నగర శివారు జిల్లాలైన మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డిలలో ఏడు నగర పాలక సంస్థలు, 21 మున్సిపాలిటీలతో సహా పంచాయతీల పరిధిలో 552 చెరువులు, కుంటలు ఉన్నాయి. అందులో 476 చెరువులు, కుంటలు, నాలాల సరిహద్దులు గుర్తించే ప్రక్రియలో భాగంగా మూడు శాఖలు సంయుక్తంగా జీపీఎస్ విధానంలో శాటిలైట్ సర్వే నిర్వహించాయి. చెరువులు, కుంటలకు సంబంధించిన వివరాలను కూడా సంబంధిత యంత్రాంగం హెచ్‌ఎండీఏకు అందజేసింది.

మచ్చుకు కొన్ని...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో ర్రా, చింతల చెరువుల్లోని బఫర్ జోన్లలో బహుళ అంతస్తుల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా పట్టించుకునే వారే లేరు. అల్వాల్ మండలం యాప్రాల్‌లోని సర్వే నంబర్ 171లో గల బడాయికుంటను ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నా.. పట్టించుకున్న దాఖలాలు లేవు. రాంపల్లిలోని ఎర్రమల్లె వాగును ఆనుకుని ఉన్న ఎకరంన్నర బఫర్ జోన్ స్థలాన్ని లేఅవుట్ చేసినా నీటి పారుదల శాఖ కిమ్మనడం లేదు. ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్‌లో ఓ స్థిరాస్తి వ్యాపారి రెండు నాలాలను ఆక్రమించి 35 ఎకరాల్లో వెంచర్ చేస్తున్నారు. ఇదే స్థితి దమ్మాయిగూడ, నాగారం, పీర్జాదిగూడ, ఘట్‌కేసర్ పురపాలక సంఘాల పరిధిలోని చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కూడా కొనసాగుతున్నాయి.

కబ్జా కోరల్లో చెరువు భూములు

నగర శివారు పట్టణాలు, గ్రామాల పరిధిలో 552 చెరువులు, కుంటలు ఉండగా, అందులో 352 చెరువులు మినహాయించి మిగతా చెరువులు, కుంటల్లోని శిఖాలు, నాలాల స్థలాలు కబ్జాకు గురైనట్లు తెలుస్తోంది. నీటి పారు శాఖ నిర్లక్ష్యం వల్ల అర్థ,అంగ బలంతో పాటు రాజకీయ పలుకుబడి ఉన్న కొంత మంది దర్జాగా చెరువులు, ఎఫ్టీఎల్, నాలా స్థలాలు కబ్జా చేశారు.

మొక్కు బడి చర్యలు...

నగర శివారుల్లోని చెరువులు, కుంటల కబ్జాలపై నీటి పారుదల శాఖ మొక్కుబడి చర్యలకు పూనుకుంటోంది. అధికార యంత్రాంగం ఆదేశాల మేరకు ఆ శాఖ వాటికి సరిహద్దులు గుర్తించి రాళ్లు పాతే కార్యక్రమాన్ని చేపట్టింది. హద్దులు నిర్ధారించుకునేందుకు జీపీఎస్ విధానంలో ఆధునిక పరికరాలు ఉపయోగించి కోఆర్డినేట్స్ (అక్షాంశ, రేఖాంశాలు)తో గూగుల్లో ఒక ఫైల్‌తో ఆన్‌లైన్‌లో సమాచారాన్ని నిక్షిప్తం చేస్తున్నా.. సరైన దృష్టి సారించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. హార్డ్, సాఫ్ట్ కాపీలు రూపొందించడం ద్వారా భూకబ్జాదారులు హద్దు రాళ్లు తొలగించినా.. స్థలాలు, భూవివరాలు భవిష్యత్తు తరాలకు సమగ్రంగా అందుబాటులో తీసుకువస్తున్నా.. నీటి పారుదల శాఖలోని పలువురు ఉద్యోగులు మొద్దు నిద్ర వీడటం లేదు.